

ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ నాయకులు



# చేతులు.. కలిసేనా!?



- జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేతల సస్పెన్షన్‌పై అధిష్ఠానం యూటర్న్?
- కొత్త, పాత నేతల మధ్య సమన్వయం దిశగా ప్రయత్నాలు
- మంత్రులు సీఆర్ఆర్ ఇంటికి వెళ్లడంపై మొదలైన గుసగుసలు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో మారుతున్న సమీకరణలు
- అగ్రనేతల తీరుతో కాంగ్రెస్ క్యాడర్ అయోమయం

ఆదిలాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేసిన సీనియర్ నేతలపై కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో గత కొంత కాలంగా తిరిగి పార్టీలో చేరేందుకు సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు సస్పెన్షన్ వేటును ఎత్తివేస్తున్నట్లు పార్టీ క్రమశిక్షణ కమిటీ ఉత్తర్వులను జారీ చేసినా.. మళ్లీ వెంటనే రద్దు చేయడంతో సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత రెండేళ్లుగా పార్టీకి అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తూ వస్తున్న గండ్రత్ సుజాత, భార్గవ్‌దేశ్ పాండే, సాజిద్ ఖాన్, సంజీవ్‌రెడ్డిలు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు మంత్రి గడ్డం వివేక్‌లు అకస్మాత్తుగా మాజీ మంత్రి సీఆర్ఆర్ ఇంటికి వెళ్లడం పార్టీలో దుమారం రేపుతోంది. మంత్రులు తీసుకున్న సొంత నిర్ణయాలను పలువురు కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన నేతలతో ఎలా సన్మానాలు, సత్కారాలు చేయించుకుంటారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మానవతా దృక్పథంతోనే సీనియర్ నేత రాంచంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లడం జరిగిందని జూపల్లి ప్రకటించినా.. పార్టీలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలపై యూటర్న్ తీసుకుంటుందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.




### సమన్వయం కష్టమే..

గత కొంత కాలంగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. నేతల మధ్య ఆధిపత్య పోరు పెరిగిపోవడంతో ఇప్పట్లో సమన్వయం కుదరడం సాధ్యంకాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి ప్రధాన కారణం సొంత పార్టీ నేతలేనని నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి భగ్గుమంటున్నారు. అయితే సీనియర్లను కాదని జూనియర్ నేతకు టికెట్ ఇవ్వడంపై సీనియర్ నేతలు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో కొంత మంది పార్టీ పెద్దలు టికెట్లు అమ్ముకుంటున్నారని సీనియర్ నేతలు బహిరంగ విమర్శలకు దిగారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటును ఎత్తి వేసేందుకు ససేమీరా అంటున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం కుదరడం సాధ్యమయ్యే పని కాదన్న టాక్ వినిపిస్తుంది. ఇటీవల మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్‌దేశ్ పాండే ప్రెస్‌మీట్ పెట్టి మరీ.. కొంతమంది నేతలకు పరోక్షంగా హెచ్చరికలు చేయడం నేతల మధ్య విభేదాలకు మరింత కారణమయ్యిందన్న చర్చ జరుగుతుంది.

### ఎవరి వాదన వారిది

మూడు నాలుగు దశాబ్దాలుగా జిల్లాలో పార్టీకి అండగా నిలిచిన మాజీ మంత్రి సీఆర్ఆర్ కుటుంబాన్ని మంత్రులు పరామర్శించడం పార్టీలో వివాదాస్పదంగా మారింది. దీనిపై ఇరువర్గాల నేతలు ఎవరికి వారే సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. సీనియర్ నేతలతో చర్చించేందుకే మంత్రులు వచ్చారని ఓ వర్గం నేతలు జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. మరో వర్గం నేతలు మాత్రం కేవలం మానవతా దృక్పథంతోనే రాంచంద్రారెడ్డి కుటుంబాన్ని మంత్రులు పరామర్శించారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఏడాదిన్నర కాలం పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పని చేసిన సీతక్క.. ఏ రోజూ సీఆర్ఆర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రయత్నించ లేదంటున్నారు. అలాగే సీనియర్ నేతల విషయంలోనూ అదేతీరుతో కనిపించింది. కానీ జిల్లా పర్యటనలో భాగంగా ఇద్దరు మంత్రులు పరామర్శ పేరిట సీనియర్ నేతలను కలవడం కాంగ్రెస్‌లో చిచ్చురేపుతుంది. మంత్రుల పర్యటనపై ఎవరికి వారే అనుకూలంగా చెప్పుకోవడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో అయోమయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. మొత్తానికి మంత్రుల పర్యటన తర్వాత కాంగ్రెస్‌లో వివిధ రకాల గుసగుసలు వినిపిస్తున్నాయి.

### మద్దతు కూడగట్టేందుకేనా?



త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రావడం ఖాయమన్న వార్తలు రావడంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు అప్రమత్తమైనట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే సీనియర్ నేతల మద్దతును కూడగట్టేందుకే మంత్రులు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. అసలే జిల్లాలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్, బోథ్

(తరువాయి 6వ పేజీలో...)

## ఘనంగా పీవీ నరసింహారావు జయంతి

ఉట్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, దివంగత నేత పీవీ నరసింహారావు జయంతిని కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ క్యాంపు కార్యాలయంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజం వేసి, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత పీవీ నరసింహారావుదని అన్నారు. తీవ్రవాదాన్ని అణిచి వేసేందుకు ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. వారు దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలు మరువలేనివి అన్నారు. ప్రతీ ఒక్కరు ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్ఎస్ఎల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ వసంతరావు, ఆర్టీవో జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, అజీమ్, నాథం, సిలువేరు లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

## డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తున్నాం : కో ఆర్డినేటర్

మావల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పిస్తున్నామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు బడి బయట (స్కూల్ డ్రాప్ అవుట్) పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమాన్ని కొనసాగుతుంది. ఇందులో భాగంగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పాత గణేష్ సినిమా థియేటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెట్‌లో అరటిపండ్లు నిమ్మకాయ సోడా అమ్ముతున్న ఇద్దరు బాలలను గుర్తించారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను తెలుసుకొని ఏ స్కూల్లో అయితే చదువు మానేశారో అదే పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మిలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అంతకు ముందు పిల్లలను సిడబ్ల్యూసీ కమిటీ ముందు ప్రవేశ పెట్టడం జరిగిందని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్, అవుట్ రిచ్ వర్కర్ అశ్విని ఉన్నారు.

## అవగాహన లేని ఎమ్మెల్యేలు : మాజీ ఎంపీ

ఆదిలాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీష్ బాబులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మాజీ ఎంపీ సోయం బాపురావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లో టైగర్ కారిడార్ ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. అప్పట్లో నోరు మెదుపని కోవ లక్ష్మి ఇప్పుడు ఎందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారో? చెప్పాలన్నారు. అలాగే ఏమాత్రం అవగాహన లేకుండా హరీష్‌బాబు మాట్లాడడం సరికాదన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలకు ఆదివాసీల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. జీవో 49ని బీజేపీ ప్రభుత్వం విడుదల చేసినా.. ఎందుకు వ్యతిరేకించ లేదని హరీష్‌బాబును ప్రశ్నించారు. జీవో 49పై ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు స్పష్టమైన ప్రకటన చేసినా.. ఆదివాసీలను తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రకటనలు చేసిన ఎమ్మెల్యేలు.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## సాయిమిత్రను సన్మానించిన కలెక్టర్

తలమడుగు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నీలగిరి మీనాక్షి-అశోక్ దంపతుల కుమార్తె సాయిమిత్ర రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో 12వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో సాయిమిత్రను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నారాయణ, సాయిమిత్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

ఉట్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశం కోసం నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఉన్నత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలకు విజేతలు అయ్యారని ఉట్నూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి శనివారం తెలిపారు. దీనిలో భాగంగా జూలై 1న హైదరాబాద్ హకీంపేట్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు 4వ తరగతి విద్యార్థులు గణేష్, శ్రీవేణి, శ్రావణి, వర్షిత, సంజయ్, కీర్తన, సమ్మక్‌లు ఎంపిక కావడంతో మండల విద్యాశాఖ అధికారి ఆశన్న పాఠశాల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు.




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## 'ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయండి'

నేరడిగొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగాం బ్రిడ్జి సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతుండటంతో ప్రజలు ప్రాణాలకు ముప్పుగా మారుతున్న పరిస్థితిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదిలాబాద్ జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ నాగేంద్ర ప్రసాద్‌రావుకు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ గులాబ్ సింగ్, జాదవ్ ప్రవీణ్ పాల్గొని ప్రజల సమస్యలను వ్యక్తిగతంగా పరిశీలించారు. ప్రజల భద్రతకు సంబంధిత శాఖలు వెంటనే స్పందించాలని వారు ఈ సందర్భంగా కోరారు.



ఏఈ నాగేంద్ర ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న సందీప్

## మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన డీఆర్డీఏ అధికారులు
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు
- త్వరలోనే పనులను ప్రారంభించేందుకు ప్రయత్నాలు



7



సీఐగా బాధ్యతలను స్వీకరిస్తున్న ప్రభాకర్

## నార్నూర్ సీఐగా పి.ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ

నార్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నార్నూర్ సీఐగా పి.ప్రభాకర్ శనివారం మండలకేంద్రంలోని సర్కిల్ పోలీస్ కార్యాలయంలో పూర్తి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాంతం ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తు నిర్మాణం కోసం చదువుపై దృష్టి సారించాలన్నారు. మైనర్ల డ్రైవింగ్ విషయం చాలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే సహించేది లేదన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఎస్సై కె.అఖిల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా అనురాధ



బోథ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బోథ్ ఆదర్శ పాఠశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా శ్రీపతి అనురాధ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ నూతనంగా విధుల్లో చేరిన ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించారు.

## ఎంపీని కలిసిన చింతగూడవాసులు

బోథ్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ గ్రామస్థులు శనివారం ఎంపీ జి.నగేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎంపీ గ్రామస్తులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగు భీమ్‌రావు పటేల్, జుగాది రావు, విజయ్, రామారావు, భూమన్న, అమృత రావు, తదితరులు ఉన్నారు.



ఎంపీ నగేష్‌ను సన్మానిస్తున్న చింతగూడవాసులు



శోభాయాత్రలో రోడ్లను ఊడుస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



.. నృత్యాలు చేస్తున్న యువతులు

## కన్నుల పండువగా జగన్నాథుడి రథయాత్ర

- శోభాయాత్రలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగన్నాథుడి రథయాత్ర కన్నుల పండువగా వైభవంగా సాగింది. ఈ రథయాత్రలో ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధుర జిన్నింగ్ ఆవరణలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పూలతో అందంగా అలంకరించిన వాహనంలో ఉంచి శోభాయాత్రను ప్రారంభించారు. ముందుగా ఈ శోభాయాత్రలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యేలు రోడ్లను ఊడ్చి రథాన్ని తాడుతో ముందుకు లాగారు. ఈ శోభాయాత్రలో మహిళలు, యువతులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జగన్నాథుడి దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లాలామున్నా, ఆకుల ప్రవీణ్, సంతోష్, అశోక్ రెడ్డి, పట్టణ ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో నిర్మించిన మూత్రశాలలకు తాళం వేసి ఉన్న దృశ్యం

## బిల్లు రాలేదని మూత్రశాలలకు తాళం

- సోనాల ప్రభుత్వ పాఠశాలలో ఘటన

బోథ్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లు రాకపోవడంతో విసుగు చెందిన ఓ కాంట్రాక్టర్.. పాఠశాలలో మూత్రశాలలకు తాళం వేసిన ఘటన శనివారం సోనాల మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 450 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సోనాలకు చెందిన మురళి అనే కాంట్రాక్టర్ రెండున్నర ఏళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలలో మూత్రశాలలను నిర్మించారు. అయితే కొంత మేర బిల్లులు వచ్చినా.. రూ. 2.50లక్షల బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ విషయమై పలుమార్లు అధికారులను సంప్రదించినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంట్రాక్టర్ శనివారం మూత్రశాలలకు సంబంధించిన గదికి తాళం వేశాడు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి.. కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లును చెల్లించి మూత్రశాలలను వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తులం బంగారం పేరుతో మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. ఇచ్చోడ పరిధిలో మొత్తం 70 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల ను అందజేశారు. అనంతరం వంద శాతం రాయితీపై వచ్చిన 52 ఎల్ఆర్‌జి కందు ల బస్తాలను రైతులకు అందజేశారు. మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ రమేష్, ఆర్ఐ హుస్సేన్, ఏఓ భగత్ రమేష్, తదితరులున్నారు.

**నేరడిగొండ:** బోథ్ మండల కేంద్రానికి చెందిన నారాయణరెడ్డి సరితకి మంజూరైన రూ.60 వేలు, బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ గ్రామానికి చెందిన గడ్డె నారాయణకు మంజూరు అయిన రూ.20,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్‌ల పంపిణీ

తలమడుగు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సామానుజ్ఞ ట్రస్ట్ తరపున పేద విద్యార్థులకు నోట్ బుక్‌లను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కుర్మే విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయులు జీవన మాధురి, మాజీ ఆదిలాబాద్ మండల వైస్ ఎంపీపీ బయస్ వార్ గంగారెడ్డి, సంతోష్ కుమార్, మామిడి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో శ్రీప్రసన్న అంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు తనకు ఎప్పుడు అండగా ఉన్నారన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.4.20 లక్షల మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, దశరథ్, గంట సురేష్, సురేష్ గౌడ్, గోవర్ధన్, సుధాకర్, డా.రమేష్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## వాహన పత్రాలు కలిగి ఉండాలి : ఏఎస్సై

నార్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని నార్నూర్ ఏఎస్ఐ ఆర్.గణపతి అన్నారు. శనివారం మండలకేంద్రం వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనానికి నెంబర్ ప్లేటు కచ్చితంగా ఉండాలన్నారు. మైనర్‌లు వాహనాలు నడుపొద్దని, తాగి వాహనాలు నడితే కేసు నమోదు చేస్తామన్నారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## 'సీఐ రహీం పాషా సేవలు చాలా గొప్పవి'

నార్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన ప్రాంత ఉమ్మడి నార్నూర్ మండలానికి సీఐగా రహీం పాషా అందించిన సేవలు చాలా గొప్పవని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ అన్నారు. బదిలీపై వెళ్తున్న సీఐ రహీం పాషానీ శనివారం గ్రామస్థులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో శాలువా పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కొత్తగా వచ్చిన సీఐ పి.ప్రభాకర్‌కు స్వాగతం పలికి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రాంత ప్రజల కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యానికి మారుపేరుగా సామాన్య ప్రజల్లో గుర్తింపు పొందారన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తి నిఘా పెట్టారన్నారు. అలాగే, యువతకు సలహాలు ఇస్తూ విద్యాభ్యాసంపై దృష్టి సారించేలా చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావు లోకండే, నర్సింగ్ మోరే, పెసా కమిటీ కోఆర్డినేటర్ సికేందర్ రాథోడ్, దాదే అల్లి, మొహమ్మద్ కురెషి, కరీం ఖాన్, కాంతరావు దుర్గే, సయద్ ఖాసిం, తదితరులున్నారు.

## 'విద్యుత్ సమస్యను పరిష్కరించాలి'

మావల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని విద్యుత్ సమస్యను పరిష్కారించాలని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెళ్లి శ్రీధర్ ఆధ్వర్యంలో వాఘపూర్ గ్రామస్థులు జిల్లా విద్యుత్ చీఫ్ ఇంజనీర్ జయవంత్ రావ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. చిన్నపాటి వర్షానికే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అదే విధంగా ప్రమాదకరంగా 11కేవీ తీగలు వేలాడుతున్న పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయమై చీఫ్ ఇంజనీర్ సమస్య పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఇందులో నాయకులు గౌతమ్ రెడ్డి, లవన్, తదితరులు పాల్గొన్నారు.

## 'తమ పనులుగా ప్రభుత్వం గొప్పలు'

ఉట్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తమ పనులుగా గొప్పలు చెప్పుకుంటుందని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంద్రా జైవంతరావు విమర్శించారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలోనే 2023 అక్టోబరు 3న ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 50 పడకల నుంచి వంద పడకలకు పెంచి అదనపు పడకల గదుల నిర్మాణం కోసం రూ.13.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆ రోజులలో టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఈ రోజు మళ్లీ పనులు ప్రారంభించడానకి ముందుకు వచ్చారన్నారు. కొత్త పనులు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. తమ హయాంలో ఆసుపత్రిలో డాక్టర్లను నియమిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్లను బదిలీ చేసిందని, ఫలితంగా ఏజెన్సీలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. భరత్‌చౌహాన్, ముజీబ్‌ఖాన్, కరీం, అజ్మీర జయచంద్ర, సోనే రావు, సత్యం, బలవంత్, ఆరేపల్లి ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు కోసం ట్రాక్టర్‌లో మొరం నింపుతున్న గ్రామస్థులు



మొరం రోడ్డుపై పోసి సరిచేస్తూ..

# ఎవరో వస్తారని.. ఎదురు చూడకుండా!

● గ్రామానికి రోడ్డు వేసుకున్న రేండ్లపల్లి గ్రామస్థులు

బోథ్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లపల్లి గ్రామస్థులు తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో శనివారం స్థానికులు 60 మంది కలిసి రోడ్డు వేసుకున్నారు. ఎవరో వచ్చి తమ గ్రామాన్ని ఉద్ధరిస్తారని తాము అనుకోవడం లేదని, తమ ఊరికి తామే రోడ్డు వేసుకొని బాగు చేసుకుంటామంటూ ఆదివాసీ గిరిజనులు రోడ్డు వేసుకోవడం గమనార్హం. కాగా, ఈ గ్రామానికి వేసవికాలంలో రోడ్డు వేస్తామని చెప్పి ఓ కాంట్రాక్టర్ రోడ్డుకిరువైపులా తవ్వి మొరం వేశారని, అయితే రోడ్డుకు ఇరువైపులా మొరం వేయడంతో మధ్యలో గుంతల మారిందని గ్రామస్థులు వాపోయారు. రోడ్డు పనులు ప్రారంభమైన సమయంలో గ్రామానికి రోడ్డు సౌకర్యం కలుగుతుందని మొదట సంతోషించామని గ్రామానికి చెందిన ఆదివాసీలు పేర్కొన్నారు. అయితే రోడ్డు పని మధ్యలోనే ఆగి పోవడంతో రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారిందని పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులంతా కలిసి శ్రమదానంతో రోడ్డు వేసుకుందామని నిర్ణయించి రోడ్డు పనులు పూర్తి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.

● ఉపాధ్యాయుడి రాక కోసం

కాగా, తమ గ్రామంలో పాఠశాల ఉండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల ను చదువుతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. అయితే తమ విద్యార్థులకు చదువు నేర్పేందుకు వచ్చే ఉపాధ్యాయుడు కాలినడకన వస్తారని, ఆయనకు ఇబ్బంది కలగకుండా రోడ్డు వేసుకుంటున్నామని అన్నారు. తాము కూడా వర్షాకాలంలో ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నామని, అందుకే మొదట గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించుకుంటున్నామన్నారు.

● నాయకుల హామీ హామీగానే మిగిలింది

ఎన్నికల వచ్చిన సందర్భంలో ప్రతీసారి నాయకులు ప్రచారం సందర్భంగా రేండ్లపల్లి గ్రామానికి రోడ్డు వేసి ఇస్తామంటూ చెప్పి వెళ్తున్నారని ఆ తర్వాత మరిచిపోతున్నారని గ్రామస్థులు వాపోయారు. ఈసారి ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను నిలదీయక తప్పదని పేర్కొన్నారు.



వైద్య శిబిరంను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

## 'డ్రైవర్లు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో రాష్ట్రీయ చాలక్ ఏక్తా మంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవర్ల మహాసభలో డ్రైవర్లకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి డీఎంహెచ్ఓ నరేందర్‌రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరంతో పాటు రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏక్తామంచ్ నాయకులు చివరి రోజు మహాసభను పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిష్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారపరంగా, రవాణా పరంగా, దేశ అభివృద్ధి చెందడంలో డ్రైవర్ల పాత్ర సైతం ఉందన్నారు. డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించాలని తెలిపారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి చూపు పరీక్షలు ఎప్పటికప్పుడుచేసుకోవాలని సూచించారు. రక్తదాన శిబిరం నిర్వహించి సామాజిక బాధ్యతను చాటడం అభినందనీయమన్నారు. ఇందులో ఏక్తా మంచ్ ఆల్ ఇండియా అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు షేక్ హబీబ్, రాష్ట్ర అధ్యక్షుడు సంజులు, నాయకులు సోఫి, ఇర్ఫాన్, బాలాజి, అభిమాన్యు, మహెబూబ్, ఎస్కే మోయిన్, తదితరులున్నారు.

## 'జిల్లాకు మేలు జరుగుతుందని భావించాం'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కొత్త హామీలు, పెండింగ్ పనుల గురించి చర్చిస్తారని అనుకున్న ప్రజలకు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు నిరాశే మిగిల్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం, బీఆర్ఎస్ 2014న అధికారం చేపట్టిందన్నారు. అప్పటికే గత ప్రభుత్వం తెలంగాణకు రూ.72వేల కోట్ల అప్పును ఇచ్చిందన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ రూ.4లక్షల కోట్ల అప్పు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రులు మాత్రం బీఆర్ఎస్ రూ.8లక్షల కోట్ల అప్పు చేసిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్, కేసీఆర్ మంత్రి వర్గంలో పని చేసిన సీనియర్ మంత్రి జూపల్లి ఇలా అబద్దాలు మాట్లాడడం సరికాదన్నారు. రెండు రోజుల మంత్రి పర్యటనతో జిల్లాకు మేలు జరుగుతుందని భావించినా.. ఎటువంటి ప్రయోజనం లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో 5వేల కోట్లతో అభివృద్ధి జరిగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. విజ్జగిరి నారాయణ, దాసరి రమేష్, అజయ్, యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లద్, సాజిదొద్దిన్, గంద్రత్ రమేష్, సేవ్వాజగదీశ్, గంగయ్య, కుమ్రరాజు, బుట్టిశివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్‌కు దేగామ విద్యార్థి ఎంపిక

బజార్‌హత్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగామ గ్రామానికి చెందిన కొక్కుల అశ్రిత్ అనే విద్యార్థి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు. కొక్కుల రాజేశ్వర్ స్రవంతిల కుమారుడు కొక్కుల అశ్రిత్ సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడంపట్ల కుటుంబ సభ్యులు అభినందించారు. కాగా అశ్రిత్ ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతుండగా నవోదయ పరీక్షలో పాసై కాగజ్‌నగర్‌లో ఈ యేడాది 6వ తరగతిలో చదువుతున్నాడు. ఈ క్రమంలో సైనిక్ స్కూల్ టెస్టుతో నాన్‌లోకల్ కేటగిరిలో నాసిక్‌లోని బన్సాలిసైనిక్ స్కూల్‌లో ఎంపికైనందున కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్త పరుస్తున్నారు.

## చేతులు.. కలిసేనా?!

(5వ పేజీ తరువాయి...)

నియోజకవర్గాల్లో గెలవలేక పోయినా.. కాంగ్రెస్ మరిం త బలపడేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ బాధ్యతలను ఉమ్మడి జిల్లా మంత్రి గడ్డం వివేక్‌కు అప్పగించారన్న ప్రచారం కూడా సాగుతుంది. ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ అన్ని రకాల ప్రయత్నాలు మొదలు పెట్టింది. జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్‌కు దీటుగా ఎదగాలన్న తపనతో కనిపిస్తుంది. అయితే నాయకత్వ లోపంతో కనిపిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వర్గ విభేదాలు తలనొప్పిగా మారుతున్నాయి. సీనియర్, జూనియర్ నేతలందరినీ సమన్వయపరిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకెళ్లే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఎన్నికల వరకు కాంగ్రెస్‌లో మరిన్ని సమీకరణలు జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఇన్‌చార్జి మంత్రి చర్యలను నిరసిస్తూ నిరసన

● కొమురం భీం విగ్రహానికి ఆదివాసీల వినతి

ఉట్నూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న కుంరంభీం కాం ప్లెక్స్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఆదివాసీల సమావేశంలో ఆదివాసీలను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అవమానించారని పేర్కొంటూ ఆగ్రహించిన ఆదివాసీలు కొమురం భీం విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనం అనంతరం శుక్రవారం రాత్రి భీం విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఆదివాసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కుల సంఘాలు ఆదివాసీ పెద్ద లు తొమ్మిది తెగల నాయకులు అందరిని పిలవడం తోటి వెళ్లడం జరిగిందని, సంఘ నాయకుల అభిప్రాయాలు చెప్పాల్సి ఉంటుందని మాకు చెప్పి ఎవరి అభిప్రాయాలు తీసుకోకుండా మధ్యలోనే ఆపి సమావేశం నుంచి బయటికి వెళ్లిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి ఆదివాసీ కులపెద్దలతో మాట్లాడకుండా జీవో 49పై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఆదివాసీలను నిరాశ పరిచిన ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి, గతంలో ఉన్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎప్పుడు కూడా ఈ విధంగా అవమాన పరచలేదని తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూరు దాదిరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, హరీష్‌బాబుల తో పాటు పూర్క బాపురావు, తుడందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, తుడందెబ్బ కుంరంభీం జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్, సలాంవరుణ్, కనక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం : ఆడె

నేరడిగొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంలాటిదని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని క్యాంప్ కార్యాలయంలో ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన శ్రీజ సూరకంటికి రూ.60 వేలు, బోథ్ మండలంలోని సాయినగర్ కాలనీకి చెందిన సోనాభాయ్‌కి రూ.55 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఇచ్చోడ మండల అధ్యక్షుడు కల్లెం నారాయణరెడ్డి, బోథ్ మాజీ మండల అధ్యక్షుడు కురుమే మహేందర్, యువజన నియోజకవర్గ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, గుడాల శేఖర్, రమేష్ యాదవ్, సింగారపు స్వామి, గజ్జల అశోక్, యువ నాయకులు ఎం.డి.సద్దాం, తదితరులు ఉన్నారు.

● ఉనికి కోసమే ఎమ్మెల్యే పాకులాట

**నేరడిగొండ:** బోథ్ ఎమ్మెల్యే కేవలం తన ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. నేరడిగొండ మండలంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వకుండా మోసం చేశారని, ఈ ప్రాంత ప్రజలకు న్యాయంగా దక్కవలసిన కుప్టీ ప్రాజెక్టుకు నిధులు రాబట్టడంలో అప్పటి జడ్పీటీసీ అనిల్ జాదవ్,బీఆర్ఎస్ నేతలు విఫలమయ్యారని పలు ఆరోపణలు చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత నేరడిగొండ మండలంలో నిధుల వరద పారుతోందని, రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

### యానిమల్ బర్త్ కంట్రోల్

## సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ

నిర్మల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ శివారులో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు శనివారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ శివారులో రూ.15 లక్షలతో ఏబీసీ (యానిమన్ బర్త్ కంట్రోల్) సెంటర్ నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత

లక్ష్మణచాంద, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. అనారోగ్యం పాలై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా నష్టపోయినందున వారిని ఆదుకొనుట కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు బీజేపీ మండల అధ్యక్షులు గాండ్ల చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేష్, బన్నెబోయిన పోశెట్టి, పడిగెల సురేష్, ఓస రాజు, మెంగు అనిల్, తదితరులు ఉన్నారు.

### నిర్మల్ నియోజకవర్గంలో..

నిర్మల్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సారంగాపూర్, నర్సాపూర్, దిలావర్‌పూర్, సోన్, మామడ, లక్ష్మణచాంద మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులు వివిధ అనారోగ్య కారణాలతో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా వారికి రూ. 15 లక్షల చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ భరోసా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీజిల్లా, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నిర్మల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని బీజేపీ సభాపక్ష నేత నియోజకవర్గ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో ఇటీవల నూతనంగా ఎన్నికైన నిర్మల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సమాజంలో పాత్రికేయుల వృత్తి ఎంతో గౌరవ ప్రదమైందని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించి కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. పాత్రికేయులంతా సంఘటితంగా ముందుకు వెళ్లాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పాత్రికేయులంతా ఒక్కతాటికి చేరడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వపరంగా పాత్రికేయులకు అందే పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు.

# భైంసాలో పరిస్థితులను మెరుగుపరచకుంటే ఆందోళన చేస్తాం

● బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

భైంసా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో నెలకొని ఉన్న అధ్వాన్నకర పరిస్థితులను సత్వరమే మెరుగుపరచకుంటూ ఆందోళనలను తప్పవని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం పార్టీ ప్రతినిధులతో కలిసి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు చేపట్టి ఆయా ప్రాంతాలోని స్థితి, గతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి సంబంధిత విషయంలో కమిషనర్ రాజేష్‌కుమార్‌ను కలిసి క్షేత్రస్థాయి పరిశీలనలోని అంశాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందచేసారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ మాట్లాడుతూ తొలకరి జల్లులకే భైంసా మున్సిపల్ కేంద్రంలో పారిశుధ్య పరిస్థితి అధ్వాన్న దశకు చేరుకుందన్నారు. గుంతలు, గోతులమయమైన ప్రధాన, అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాదచారులు నడవడానికి వీలులేకుండా ఉందన్నారు. ఇక మురికి కాలువల్లోని పూడిక తొలగింపులు సక్రమంగా జరుగక పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని విమర్శించారు. పట్టణ ప్రకృతి వనాలు ఆనవాళ్లు కోల్పోయాయన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో నీరు కలుషితమవుతోందన్నారు. లోపభూయిష్టమైన నిర్వాహణ వ్యవస్థ మూలంగానే పరిస్థితి అధ్వాన్నకరంగా మారిందన్నారు. మున్సిపల్ అధికార యంత్రాంగం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని వెల్లడించారు. ఇందులో పార్టీ ప్రతినిధులు రావుల పోశెట్టి, అబ్దుల్ వాసే, నిమ్మ సురేష్, అజీజ్ ఖురేషీ, హస్దే సాజన్, బీమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో మరణించిన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

ఖానాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 11వ వార్డు పరిధిలో గల విద్యానగర్ కాలనీలో గత కొన్ని నెలల క్రితం కోతుల దాడిలో కిందపడి మృతి చెందిన బొంగోని లక్ష్మీ కుటుంబానికి స్త్రీనిధి ప్రమాద బీమా మంజూరు అయ్యింది. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబానికి స్త్రీ పరపతి సమాఖ్య లిమిటెడ్ ద్వారా రూ. 10 లక్షల చెక్కును అధికారులు, స్థానిక నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం మాట్లాడుతూ... బాధిత కుటుంబానికి ప్రమాద బీమా మంజూరు అయ్యేందుకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఎంతగానో కృషి చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ పథకం ద్వారా మంజూరయ్యే ప్రమాద బీమాను రూ. 10 లక్షలు పెంచిన తర్వాత రాష్ట్రంలో మొదటిసారిగా ఖానాపూర్‌కే మంజూరయ్యాయని పేర్కొన్నారు. మహిళలు డ్వాక్రా గ్రూపులలో సభ్యత్వం తీసుకుని బీమా కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా అధికారి పీడీ సుభాష్, మున్సిపల్ అధికారి టి. సురేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాజిద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పరిమి సురేష్, అమానుల్లా ఖాన్, మైనార్టీ మండల పట్టణ అధ్యక్షులు సలీమ్ ఖాన్, షౌకత్ పాషా, తోట సత్యం, కే. రవి, కమల్ రాజ్, మడిగెల గంగాధర్, అడ్వాల శంకర్, అశోక్, శివ, స్త్రీనిధి మేనేజర్ మహేందర్, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులు, తదితరులున్నారు.



బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల చెక్కును అందజేస్తున్న అధికారులు, నాయకులు

## నిరుపేద కుటుంబానికి ఓకేఆర్ ఫౌండేషన్ అండ...

ఖానాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ నిరుపేద కుటుంబానికి ఓకేఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. శనివారం ఆ కుటుంబానికి ఓకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓకేఆర్ ఫౌండేషన్ బృందం సభ్యులు తోట సత్యం, సిరిపురం నాగరాజు, బీసీ రాజన్న, రాజేందర్, పాలిక్ శ్రీనివాస్, బీసీ రమేష్, సుధాకర్, తదితరులున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కడెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామంలో బింగి అంజన్నకు మంజూరైన 56 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ యువ నాయకులు ముడికే మల్లేష్ అందజేశారు. అనంతరం ముడికే మల్లేష్ మాట్లాడుతూ... తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదల జీవితాలను వెలుగులు నింపుతున్నారని ఈ నిధి ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం అకస్మాత్తుగా ఎదురైన ఆపదలో అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాజేష్, కంతి గంగాసాగర్, ముడికే సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

## ముథోల్‌లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ముథోల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో సుదర్శన్ పటేల్ పాల్గొని పరిశీలించారు. వారానికి రెండుసార్లు డ్రై డే పాటించడం, నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, మలేరియా, డెంగ్యూ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, పంచాయతీ ఈవో అన్వర్, తదితరులున్నారు.

## రేపు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

బాసర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా సోమవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని బీజేపీ నాయకులు పి. సాయినాథ్ పటేల్ తెలిపారు. మంజూరైన లబ్ధిదారులు హాజరై చెక్కులను పొందాలని చెప్పారు. బాసర మండల పరిధిలో 33 మందికి చెక్కులు వచ్చాయని వారికి సమాచారం అందించాలన్నారు.

### రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో

## నిర్మల్ జిల్లా విద్యార్థికి రెండవ ర్యాంక్




విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచడం ద్వారా విద్యా ప్రమాణాలను అభివృద్ధి చేసేందుకు ఒలంపియాడ్ పోటీపరీక్షను నిర్వహిస్తున్నామని సేమ్స్ తెలిపింది. గత సంవత్సరం నిర్వహించిన ఈ ఒలంపియాడ్ పోటీ పరీక్షలో శ్రీవాణి స్కూల్ నిర్మల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థిని కే. హర్షిత రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. శనివారం హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో అవార్డు ప్రధానోత్సవంలో విద్యార్థిని కే.హర్షితకు క్యాష్, అవార్డుతో పాటు మెమొంటో, శాలువాలతో సన్మానించారు. హర్షిత తండ్రి కే.లక్ష్మారెడ్డితో కలిసి అవార్డును అందుకుంది. అవార్డు పొందినందుకు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

### స్థానిక సంస్థల ఎన్నికల

## పోస్టర్ ఆవిష్కరించిన ఆమ్ ఆద్మీ పార్టీ

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్నికల సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. జిల్లాలో నిజాయితీ, సమర్థవంతమైన పాలనను అందించడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ ముందుకు వస్తోందని, అవినీతికి తావులేని, పార దర్శకమైన పాలన ద్వారా మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మున్సిపాలిటీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలతో సహా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు సమర్థవంతంమైన, నిజాయితీ గల అభ్యర్థుల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వ నమోదును ఆహ్వానిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్, సోఫీ ఇలియాజ్, బి. శ్రీనివాస్, వినోద్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

దిలావర్‌పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శనివారం శంకుస్థాపన చేశారు. అధికారులు ఇంటి నిర్మాణానికి సంబంధించిన విధి విధానాలను లబ్ధిదారులకు వివరించారు. కాల్వ దేవస్థానం చైర్మన్ అంగూర్ మహేందర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం లాంటిదన్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులు చెల్లించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సనా ఫాతిమా, పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, నాయకులు దమ్మ మహేష్, లస్మయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నాయకుల విగ్రహాలకు జలాభిషేకం

దిలావర్‌పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రతీ శనివారం జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేయాలని ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలను శనివారం మంచినీటితో శుభ్రం చేశారు. మండలంలోని కాల్వ గ్రామంలో గాంధీ, డా. బిఆర్. అంబేద్కర్, చాకలి ఐలమ్మ, తెలంగాణ తల్లి విగ్రహాలను నీటితో శుభ్రంగా కడిగారు. విగ్రహాల వద్ద చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేశారు. ప్రతీ శనివారం ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు దేవస్థానం చైర్మన్ మహేందర్ అన్నారు. గ్రామాల్లో ప్రతిష్టించిన జాతీయ నాయకుల విగ్రహాలను విగ్రహాలుగా చూడొద్దని, భవిష్యత్ తరాలకు ఆ విగ్రహాలు స్ఫూర్తి ప్రదాతలవుతాయన్నారు. ఆ విగ్రహాల గురించి, వారి గొప్పతనం గురించి తెలుసు కునేందుకు రాబోయే తరాలు ఆసక్తి కనబరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

## వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

### పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

# అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్లు ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్ పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోప ముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

### కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్లు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

### నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

### ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

# దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం


పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురి చేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

# మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్

● ప్రతిపాదనలు సిద్ధం చేసిన డీఆర్డీఏ అధికారులు ● ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో ఏర్పాటు ● త్వరలోనే పనులను ప్రారంభించేందుకు ప్రయత్నాలు


ఆదిలాబాద్‌లో పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేసే స్థలం ఇదే..

ఆదిలాబాద్, జూన్28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశాలతో ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు, జడ్పీ క్యాంప్ ఆఫీస్ మధ్యలో ఉన్న సర్వే నెంబర్ 349లో పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జడ్పీ అధికారులు జిల్లా మహిళ సమాఖ్యకు 7గుంటల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇతర అనుమతుల కోసం అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇండియన్ ఆయిల్ సంస్థ సహకారంతో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోను పెట్రోల్‌బంక్ నిర్వహణ బాధ్యతలను జిల్లా మహిళ సమాఖ్యకు అప్పగించనున్నారు. పెట్రోల్‌బంక్ నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయంతో జిల్లా సమాఖ్యను మరింత బలోపేతం చేయనున్నారు. పెట్రోల్ బంక్ విధులు నిర్వహించిన మహిళలకు గౌరవ వేతనంతో పాటు కొంత కమిషన్ రూపంలో ఇవ్వనున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుతో కైలాసనగర్‌తో పాటు కేఆర్‌కే కాలనీ, అంకోలి, తంతోలి, పాత హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులకు పెట్రోల్, డిజీల్ మరింత అందు బాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. కైలాస్‌నగర్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సెంటర్ ప్లేస్ కావడంతో పెట్రోల్, డీజిల్ వినియోగం కూడా భారీగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పెట్రోల్ బంక్ ఏర్పాటుతో వాహనదారులకు సేవలు అందుబాటులోకి రావడంతో పా టు మహిళా సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటును అందించే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ..

**- రవీందర్‌రాథోడ్,డీఆర్డీఏ పీడీ, ఆదిలాబాద్**



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా ప్రత్యేక చొరవ తీసుకోడంతోనే పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేయడం సాధ్యపడుతుంది. ముఖ్యంగా ఇండియన్ ఆయిల్ సంస్థ ప్రతినిధులతో పలుమార్లు మాట్లాడి పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసే విధంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కైలాస్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యతలను జిల్లా సమాఖ్యకు అప్పగిస్తాం. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే పెట్రోల్‌బంక్ నిర్వహణ విజయవంతమైతే జిల్లాలో మరిన్ని బంక్‌ల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. మహిళ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్ధేశం.

### మహిళలకు ఉపాధి కలుగుతుంది..

**- పట్ల లక్ష్మి ,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, ఆదిలాబాద్**



పెట్రోల్‌బంక్ నిర్వహణతో మహిళలకు ఉపాధి కలుగుతుంది. దీని నిర్వహణ అంతా మహిళలే చేపడుతారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయం. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా నిర్ణయానికి జిల్లా సమాఖ్య తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలనే ఉద్దేశ్యం మంచిదే. ఉపాధితో పాటు మహిళలకు ఆర్థిక పరమైన లాభం కలుగుతుంది. డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్‌బంక్‌ను విజయవంతంగా నిర్వహిస్తాం.

# ఆధార్ కేంద్రం లేక అవస్థలు


బాసర తహసీల్దార్ పవనచంద్రకు ఆధార్‌సెంటర్ కోసం వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్యాం

బాసర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అన్నిటికీ ఆధార్ తప్పనిసరి అయింది. ఏ చిన్న పొరపాటు ఉన్న పని కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ప్రజలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అందుబాటులో ఆధార్ సెంటర్ ఉన్న పనులు కానీ ఈ రోజుల్లో బాసర మండల వాసులకు ఆధార్ సెంటర్ లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో కనీసం ఒక్క కేంద్రం కూడా లేకపోండంతో పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ చిన్న పని ఉన్న పక్కన ఉన్న నిజామాబాద్ జిల్లాకు వెళ్తున్నారు. చిన్న చిన్న పనులకు సైతం పేద, మధ్య తరగతి ప్రజలు పనులు మానుకొని అందుబాటులో లేని ఆధార్ సెంటర్ చుట్టు తిరుగుతున్నారు. అనేక సార్లు అధికారులకు మండల వాసులు విన్నవించినా ఫలితం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి తాజాగా బాసర మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు కోర్వశ్యాం తహసీల్దార్ పవనచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల గురించి ప్రస్తావిస్తూ.. ఆదార్‌సెంటర్ ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రానున్న ఎన్నికల్లో

# డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

● బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మంజులాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కడ్తాల్ గ్రామానికి చెందిన బర్మ గంగాదాస్ ఆయన అనుచరులు శనివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే, బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఈ మేరకు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్న ట్లు పేర్కొన్నారు. బీజేపీ దేశ సమగ్రతకు, సమైక్యతకు అభివృద్ధి సంక్షేమ రంగాల్లో చేపడుతున్న అనేక కార్యక్రమాల పట్ల ప్రజలకు అత్యంత నమ్మకం కుదిరిందని అందులో భాగంగానే గంగాదాస్, ఆయన అను చరులు పార్టీలో చేరారని వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించామన్నారు. రానున్న ఎన్నికల్లో అటు కేంద్రంలోను ఇటు రాష్ట్రంలోను డబుల్ ఇంజన్ సర్కార్ జయ కేతనం ఎగరేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి నెరవేర్చడం లేదన్నారు. రైతులకు పంట రుణాలకు పెట్టుబడి సహాయం రెండు పంటలకు ఎ గ్గొట్టిందని ఈసారి పంటలకు పూర్తిస్థాయిలో జమ చేయలేదని విమర్శించారు. దరఖాస్తులకు అనుగుణంగా రేషన్ కార్డులు, పింఛన్లు అందజేయడం లేదని దీంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. ప్రభుత్వ ఖజానాలో నిధులు లేవని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్య క్షులు భాజపా నాయకులు వి.సత్య నారాయణ గౌడ్, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, జమాల్ పాల్గొన్నారు.

# ఘనంగా అకాడి పండుగ


లక్కారం దేవుషాగూడాలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఉట్నూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాజాదేవుషా గూడ ఆదివాసీ గిరిజనులు ఆషాడ మాసం పురస్కరించుకుని శనివారం అకాడి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. లక్కారం రాజా దేవుషా గూడ గోండు ఆదివాసీలు అకాడి పండుగ సందర్భంగా గ్రామ శివారులో అకాడి పండుగ నిర్వహించి అడవిలోకి వచ్చే తమ ఆవులు, మేకలు, పశువులను జంతువుల భారీ నుంచి చల్లగా కాపాడాలని అకాడి రాజులు దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ ఆత్రం రాజా గంగాధర్, మడా విజంగు, దేవరి ఆత్రం నాగోరావ్, తొడసం సుంగు, కుంరనాగోరావు, పుర్క బాదిరావు పాల్గొన్నారు.

# బోథ్ ఆసుపత్రికి పెరిగిన రోగుల తాకిడి


వైద్యం కోసం ఆసుపత్రిలో బారులు తీరిన ప్రజలు

బోథ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకు రోగుల తాకిడి పెరుగుతుంది. ప్రతిరోజు గత మూడు రోజుల నుంచి అవుట్ పేషెంట్లుగా 300 మంది వరకు వస్తున్నారు. దీంతో వైద్యుల వద్ద రోగుల తాకిడి పెరుగుతూ వస్తున్నాయి. వర్షా కాలం ప్రారంభంలోనే రోగుల తాకిడి అధికంగా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందోనని పట్టణ ప్రజలు అంటున్నారు. పట్టణంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మురికి కాలువ లను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**● పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: ఈవో**

మండల కేంద్రంలో పారిశుద్యం పరిరక్షణకు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని పంచాయతీ ఈవో అంజయ్య తెలిపారు. ప్రతీరోజు ఉదయం సాయంత్రం పూట పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరుగుతుందన్నారు. అయితే ప్రజలు తమ ఇళ్ల వద్ద మురికినీరు నిలువ ఉండకుండా చూసు కోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

**● ముందు జాగ్రత్త అవసరం**

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున ప్రజలు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. శుభ్రమైన నీటిని తాగాలని అవసరమైతే వేడి చేసి చల్లారిన తర్వాత నీటిని తాగాలని పట్టణ ప్రజలకు వైద్యులు సూచిస్తున్నారు. ఆహార పదార్థాల పైన తప్పనిసరిగా మూతలు ఉంచుకోవాలని అవసరమైతే వేడి భోజనాన్ని చేయాలని కోరుతున్నారు.






# కల్లు తిరిగే.. దందా

- జిల్లాలో జోరుగా అల్ఫ్రాజోలం, క్లోరోహైడ్రేట్ తయారీ
- మత్తుకోసం కల్లులో మిక్సింగ్ చేస్తున్న రసాయనాలు
- జిల్లాలోని పలు కల్లు దుకాణాలకు తరలింపు
- బానిసలుగా మారుతున్న పేదలు
- పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ అధికారులు

నిర్మల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోజురోజుకు కల్లుకు బానిసలవుతున్న వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొంత మంది కల్లు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి విచ్చలవిడిగా దుకాణాలను ఏర్పాటు చేస్తుండడమే కాకుండా వినియోగదారులకు ఎక్కువగా మత్తు కలిగించే రసాయనాలను అందులో కలుపు తున్నారు. ముఖ్యంగా కల్లు తయారీలో వినియోగించే క్లోరోహైడ్రేట్, అల్ఫ్రాజోలంల కారణంగా కల్లులో ఎక్కువగా మత్తు ఉంటుంది. ఈ మత్తు పదార్థాలకు అలవాటు పడిన కల్లు వినియోగదారులు ఆ కల్లుకు పూర్తి బానిసలుగా మారిపోతున్నారు. వరుసగా రెండు మూడు రోజుల పాటు ఈ మత్తులతో కూడుకున్న కల్లును తాగనట్లయితే వారు అక స్మాత్తుగా పిచ్చిచేష్టలు చేస్తూ మానసిక రోగులుగా మారిపోతున్నారు. కాగా చాలా చోట్ల ఇలాంటి మత్తు కల్లును విక్రయించే బడా వ్యాపారు లకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో దీనిని అడ్డుకో వాల్సిన ఎక్సైజ్ అధికారులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మహారాష్ట్ర నుండి ఈ క్లోరోహైడ్రేట్, అల్ఫ్రాజోలంలను పెద్ద ఎత్తున నిర్మల్ మీదుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు ఈ కల్లు మాఫియా సిండికేట్ తరలిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలుసార్లు భారీ ఎత్తున తరలిస్తున్న అల్ఫ్రాజోలం, క్లోరోహైడ్రేట్లు పట్టుబడ్డాయి. సరిహద్దుల్లో క్లోరో హైడ్రేట్, అల్ఫ్రాజోలం అక్రమ తరలింపుపై సరైన నిఘా లేని కారణంగా ఈ కల్లు వ్యాపారులు దర్జాగా రవాణా సాగిస్తున్నారంటున్నారు.

### మహారాష్ట్రలోని భీవండి నుంచి అక్రమ సరఫరా..

మహారాష్ట్రలోని భీవండి, సోలాపూర్ పరిసరాల్లో చాలా చోట్ల క్లోరో హైడ్రేట్, అల్ఫ్రాజోలం కెమికల్స్ తయారీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాంతంలో ఇవి మినీ పరిశ్రమలుగా కొనసాగుతున్నాయి. ఇక్కడి తయారీదారులతో కొంతమంది కల్లు వ్యాపారులు మిలాకత్ అయి గుట్టు చప్పుడు కాకుండా భారీ ఎత్తున ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు తరలిస్తున్నారు. అయితే స్థానికంగా మరికొంత మంది కల్లు వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి గ్రామల్లోని కల్లు వ్యాపారులకు రహస్యంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యా దులు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లోని కల్లు డిపోలలో కూడా ఈ రసాయనాలను మత్తుకోసం కల్లులో ఎక్కువగా కలుపుతున్నారంటున్నారు. లింబావాలి నుంచి కాకుండా సోలాపూర్, భీవండిల నుంచి కూడా ఈ రసాయనాలను కార్లు, మినీట్రక్కులలో ఎవరికీ అనుమానం రాకుండా రహస్యంగా జిల్లాను దాటించి మిగతా జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు.

### బానిసలవుతున్న యువకులు

కాగా ఎక్కువ మత్తు కిక్కునిస్తున్న కల్లుకు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన యువకులే ఎక్కువగా బానిసలవుతున్నట్లు చెబుతున్నారు. వీరితో పాటు కూలీలు, చాలా మంది డ్రైవర్లు సైతం కల్లుకు బానిసలుగా మారి మత్తులో జోగుతున్నారు. అయితే ఇలా క్లోరోహైడ్రేట్, అల్ఫ్రాజోలంలు కలిపిన కల్లుకు బానిసలైన వారు ఈ కల్లును అకస్మాత్తుగా మానేస్తే తీవ్ర అనారోగ్యానికి గురి అవుతుండడమే కాకుండా మానసికంగా మతిస్థిమితం కోల్పోయి పిచ్చిచేష్టలకు పాల్పడుతున్నారు. అలాగే ఈ కల్లుకు బానిసలైన వారు ఊపిరితిత్తుల వ్యాధులు, మానసిక రుగ్మతలు అలాగే టీబీ, జీర్ణకోశ వ్యాధులకు గురవుతుండగా మరికొంతమంది క్యాన్సర్ లాంటి వ్యాధి బారిన పడుతున్నారంటున్నారు.

### రాజకీయ నేతల అండతో..

కాగా మూడు ఉమ్మడి జిల్లాల్లో విచ్చలవిడిగా కల్లు వ్యాపారం చేసే కొంత మందికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నట్లు చెబుతున్నారు. రాజకీయ అండదండలతో ఈ మూడు జిల్లాల్లో కల్లు మాఫియా రెచ్చిపోతోందన్న ఆరోపణలున్నాయి. ఈ రాజకీయ అండదండల కారణంగా అధికారులు సైతం కల్లు డిపోలు, దుకాణాలపై తనిఖీలు చేసేందుకు వెనుకాడుతున్నారన్న అభిప్రాయాలున్నాయి. అయితే కల్లు వ్యాపారులకే కాకుండా కల్లులో కలిపే క్లోరో హైడ్రేట్, అల్ఫ్రాజోలంల అక్రమ సరఫరాదారులకు సైతం రాజకీయ అండ దండలున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### తయారీ యూనిట్ పట్టివేత..

కాగా మహారాష్ట్రలోని సోలాపూర్, భీవండి లాంటి ప్రాంతాల నుంచి క్లోరోహైడ్రేట్, అల్ఫ్రాజోలంతో పాటు క్లోరో అనే ద్రావణాన్ని సైతం ఇక్కడికి తీసుకువస్తున్నారు. అయితే క్లోరో హైడ్రేట్, అల్ఫ్రాజోలంను తీసుకురావడం కష్టం అవుతున్న కారణంగా సునాయాసంగా రవాణా చేసేందుకు వీలున్న క్లోరో ద్రావణాన్ని ఇక్కడికి తీసుకువస్తున్నారు. దీనికోసంగాను నిర్మల్ పట్టణ సమీపంలోని చిట్యాల్ గ్రామ సమీపంలో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో మినీ ప్రోడక్ట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి వ్యవసాయ క్షేత్రంలో క్లోరో ద్రావణంతో క్లోరోహైడ్రేట్‌ను తయారు చేస్తున్నారు. లిక్విడ్ క్లోరోను గడ్డకట్టించేందుకు దానిని డ్రమ్ములలో పోసి గుంతలు తవ్వి దాని చుట్టూ ఐస్ గడ్డలను పది రోజులపాటు నిల్వ చేస్తున్నారు. దీంతో ఈ లిక్విడ్ గడ్డకట్టిన తర్వాత అది క్లోరోహైడ్రేట్‌గా మారుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మినీ ప్రోడక్ట్ యూనిట్ సమాచారాన్ని తెలుసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారం రోజుల క్రితం దాడి చేసి తయారీ దారులను పట్టుకోవడమే కాకుండా పెద్ద ఎత్తున క్లోరో హైడ్రేట్, అల్ఫ్రాజోలం సంచులను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారులపై కేసులు నమోదు చేశారు.

## ఆర్జీయూకేటీ మరో ముందడుగు.. టెడెక్స్ ఆమోదం



టెడెక్స్ ఆర్జీయూకేటీ పోస్టరును విడుదల చేస్తున్న వైస్ చాన్సలర్ గోవర్ధన్

బాసర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ మరో మైలురాయి దాటింది. ప్రపంచ వ్యాప్తంగా 190కి పైగా దేశాల్లో స్వతంత్ర్యంగా నిర్వహించబడే టెడెక్స్ ఈవెంట్ల జాబితాలో చేరుతూ టెడెక్స్ అమోదం పొందినట్లు వీసీ గోవర్ధన్ తెలిపారు. శనివారం టెడెక్స్ లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెడెక్స్ ఆర్‌జీయూకేటీ సంయుక్తగా విమర్శనాత్మక ఆలోచన, ప్రజాసంభాషణ నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడానికి ఇది గొప్ప వేదికని అన్నారు. గ్రామీణ విద్యార్థులు గొంతును గ్లోబల్ ఫోరమ్‌లో వినిపించేందుకు ఇది మార్గదర్శకతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మురళీధర్శన్, అసోసియేట్ డీన్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాకేష్‌రెడ్డి, ఐఐఈడీ కోఆర్డినేటర్, సుజయ్ సర్కార్ విద్యార్థులున్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

నిర్మల్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలోని ఆస్థాన మండపం వద్ద నిర్వహించిన సంస్కృతి కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం జిల్లా నృత్య కళాకారులు పాల్గొన్నట్లు నృత్య గురువు సంగినేని నృవ వినయ్ తెలిపారు. ఈ నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగిందని తెలిపారు. పట్టణంలోని స్వరూపిణి నృత్య కళాక్షేత్రం, కళాకారులు ఇట్టి ముద్దుగారే, భావములోన, సతులలోన తదితర పాటలకు నృత్యం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువు అభినందించారు.

## పాఠశాలలో సీసీ కెమెరాలు ధ్వంసం



సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న పోలీసులు

బాసర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని సీసీ కెమెరాలు గుర్తు తెలియన వ్యక్తులు ధ్వంసం చేశారు. అంతేకాకుండా మరికొన్ని కెమెరాలు ఎత్తుకెళ్లినట్లు ప్రధాన ఉపాధ్యాయులు నర్సయ్య తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులతో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అయన తెలిపారు. పాఠశాల వద్ద రాత్రి కొంత మంది మద్యం సేవిస్తూ.. ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారని అందుకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కెమెరాలను ధ్వంసం చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. దీంతో బాసర ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చెపట్టారు. కెమెరాలను ధ్వంసం చేశారు కానీ రికార్డు అయిన దృశ్యాలను పరిశీలించారు.

ధాన్యం తరుగు తీసి

## మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ముథోల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ముథోల్, సారంగాపూర్, మామడ మొదలగు వివిధ మండలాల్లో ధాన్యం తూకంలో అక్రమ కటింగ్‌లు చేసి రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం నిర్మల్ జిల్లా భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని అమ్మినప్పుడు కొనుగోలు కేంద్రం వద్ద రాసిన ట్రాక్ షీట్‌కి రైస్ మిల్ ఇచ్చే ట్రాక్ షీట్‌కి అత్యంత వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. కొన్నిచోట్ల లారీకి 50 నుంచి 90 కంటే ఎక్కువ బస్తాలు వ్యత్యాసం ఉంటుందని అన్నారు. చాలా చోట్ల ఏ గ్రేడ్ ధాన్యానికి కూడా సాధారణ ధాన్యంగా చూపించి రైతులను మోసం చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయమై తెలంగాణ వ్యవసాయ ఛైర్మన్, రైతు కమిషనర్‌కు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాల్సిందిగా కలెక్టర్ కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు ఓస రవీందర్, కార్యదర్శి కే. శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి రాంగోపాల్‌రెడ్డి, సంపర్క్ ప్రముఖ్ కే. రాజేశ్వర్‌రెడ్డి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

- ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కుభీర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పేదవాడి సొంతింటి కలను విజయవంతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టిందని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. శనివారం కుప్టి, పార్డి(కే), డొడర్న సాయినగర్ తండాలో లబ్ధిదారులు నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం పార్డి(కే) గ్రామంలోని హనుమాన్ ఆలయంలో మున్నూరుకాపు, ఆలయ కమిటీ నాయకులు ఎగ్గాం సాయినాథ్, సాతం రవికుమార్, బందెల శంకర్, ఎమ్మెల్యే పటేల్‌కు శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వివరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వం మంజూరు చేసిన 80 కళ్యాణ లక్ష్మీ, 5షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు వడ్నం నాగేశ్వర్, కనకయ్య, సాంఫ్లీ రమేష్, ఏశాల దత్తాత్రి, రాథోడ్ శంకర్, బోయిడి విఠల్, మోహన్, ఆత్మచైర్మన్ వివేక్, ఎంఆర్‌వో శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## మాకెవ్వరికీ ఇళ్లు లేవు

- పాత ఎల్లాపూర్ ఒడ్డెవాడ కాలనీ వాసులు

ఖానాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తమకెవ్వరికీ ఇళ్లు లేవని కొంతమంది ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారని పాత ఎల్లాపూర్ వడ్డెర కాలనీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అన్నారు. శనివారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కుంచెపు యోగి విలేకరులతో మాట్లాడారు. పాత ఎల్లాపూర్ వడ్డెర కాలనీలో ఇళ్లు ఉన్నవారికే ఇళ్లు ఇచ్చారంటూ కొంత మంది చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గ్రామంలో 14 మంది లబ్ధిదారుల్లో ఒక్కరికి ఇళ్లు లేదన్నారు. ఆరోపణలు చేయడం మానుకొని అనర్హులకు ఇళ్లు ఇచ్చినట్లు నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఏ ఒక్క నిరుపేద వద్ద ఇందిరమ్మ ఇళ్ల కోసం ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదని యోగి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కుంచెపు గంగామణి, పల్లపు లక్ష్మీ, అలకుంట రాజేశ్వరి, అల్లెపు లక్ష్మీ, తదితరులున్నారు.

## భామ్ని గ్రామ పంచాయతీలో అడిషనల్ కలెక్టర్ తనిఖీ



భామ్ని(బి)లో పాఠాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నర్సాపూర్(జి), జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భామ్ని గ్రామ పంచాయతీలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా ఆయన గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త విభజన కేంద్రం (సెగ్రిగేషన్ షెడ్), నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, పారిశుద్ధ్యం, గ్రామ పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న పాఠాలను అడిషనల్ కలెక్టర్ పాఠశాల గదిలో కూర్చొని శ్రద్ధగా విన్నారు. పరిశీలన అనంతరం, అడిషనల్ కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి (పీఎస్), ఇతర సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామ పంచాయతీ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, రికార్డుల పటిష్టత, నర్సరీల అభివృద్ధి, అంగన్‌వాడీ , పాఠశాలల నిర్వహణపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా చూడాలని, పనులలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు.

## ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన భైంసా జూనియర్ న్యాయాధికారి



ఏరియా ఆసుపత్రిలో జూనియర్ సివిల్ న్యాయాధికారి దేవేంద్రబాబు

భైంసా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని శనివారం భైంసా జూనియర్ సివిల్ న్యాయాధికారి దేవేంద్రబాబు తనికీ చేశారు. మధ్యాహ్నం వేళలో ఏరియా ఆసుపత్రికి వచ్చిన జడ్జి దేవేంద్రబాబు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఇన్ పేషంట్ విభాగంతో మొదలైన పరిశీలన ఔట్ పేషంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఎక్స్‌రే, ఆరోగ్యశ్రీ వార్డ్, ప్రసూతి వార్డ్ విభాగాలను పరిశీలించారు. నవజాత శిశువు కేంద్రంలో పరికరాల తీరును పర్యవేక్షించారు. ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్, ముథోల్ ఆసుపత్రి సూపరిండెంట్ డా. జాదవ్ అనిల్ కుమార్‌లు ఆసుపత్రి నిర్వాహణ వ్యవస్థ, ఆయా విభాగాల పని తీరును వివరించారు. అనంతరం జూనియర్ జడ్జి ఆసుపత్రి నిర్వాహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల శస్త్ర చికిత్సలు అధికంగా నిర్వహించడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

## మాదక ద్రవ్యాలకు అలవాటైతే జీవితాలు నాశనమవుతాయి

లక్ష్మణచాంద, జూన్ 28 (ఆంధ్రజ్యోత) : మాదకద్రవ్యాలు సేవించుటకు మీరు అలవాటు అయినట్లయితే మీ జీవితాలు నాశనం అవుతాయని విశ్రాంత ఉపాధ్యాయులు కిషన్‌రావు శనివారం హెచ్చరించారు. మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల విద్యార్థులందరికీ నిర్మల్ సీనియర్ న్యాయాధికారి రాధిక ఆధ్వర్యంలో ఏర్పడిన జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టం గూర్చి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గంజాయి, కొకైన్, హెరాయిన్, గుల్కారం, విస్కీ, బ్రాందీ, బీరు లాంటి మత్తు పదార్థాలకు ఒక్కసారి అలవాటైతే జీవితాంతం బానిసలుగా మారిపోయే అవకాశం ఉందన్నారు. అలా బానిసలైన వారు నిత్యం మత్తులో ఊగుతుంటారని, మాదక ద్రవ్యాలు తీసుకోకుంటే జీవించలేని పరిస్థితిలో ఉంటారన్నారు. నిత్యం మత్తులో తూగటం వలన ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుంటారని, మాదక ద్రవ్యాల కోసం ఇంట్లో ఉన్న వస్తువులను సహితం అమ్మేస్తుంటారని అన్నారు. మత్తులో ఉన్నప్పుడు ముఖ్యంగా గంజాయి సేవించినప్పుడు తీవ్ర ఉద్రేకానికి లోనై హత్యలు, అత్యాచారాలు వంటి నేరాలకు పాల్పడి జీవితాంతం జైలు శిక్ష అనుభవిస్తారన్నారు. కాబట్టి నేటి విద్యార్థులంతా రేపటి భావిభారత పౌరులని, ఎవరు కూడా మత్తు పదార్థాలు సేవించరాదన్నారు. ఎవరైనా వ్యక్తులు మీకు మత్తు పదార్థాలు అలవాటు చేయాలని బలవంతం చేసినా... మత్తు పదార్థాలు అమ్మిన స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం మత్తు పదార్థాలను ఎట్టి పరిస్థితిలో సేవించమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ సభ్యులు, విశ్రాంత ఎంపీడీవోలు బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, విశ్రాంత ఉపాధ్యాయుడు గంగన్న, ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్ ఆచార్య, తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలను వివరిస్తున్న న్యాయ సేవ సంస్థ సభ్యులు

## నర్సాపూర్(జి)లో అక్రమ నిర్మాణాలపై అధికారుల సంయుక్త సర్వే



నర్సాపూర్(జి), జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నీటి పారుదల కాలువ ఆక్రమణలు, అక్రమంగా నిర్మించిన సైడ్ వాల్‌పై అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. నర్సాపూర్(జి) నివాసి బర్కుంట సురేష్‌కు చెందిన అక్రమ నిర్మాణాన్ని పరిశీలించేందుకు ఈ బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఈ సర్వేలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) తిరుపతి రెడ్డి, మండల సర్వేయర్, పంచాయతీ రాజ్ అధికారులు, నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) గంగాధర్, పంచాయతీ కార్యదర్శి (పీఎస్) కైలాస్ రాథోడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. నీటి పారుదల కాలవ ఆక్రమణ, సైడ్ వాల్ అక్రమ నిర్మానం వల్ల కలిగే ప్రభావాలపై అధికారులు చర్చించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అక్రమ నిర్మాణాలను తొలగించడంపై తదుపరి చర్యల కోసం నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇలాంటి ఆక్రమణలు ప్రభుత్వ భూములకు నష్టం కలిగించడమే కాకుండా నీటి పారుదల వ్యవస్థకు కూడా ఆటంకం కలిగిస్తాయని అధికారులు పేర్కొన్నారు. అక్రమ కట్టడాలను కూల్చేస్తామని అధికారులు హెచ్చరించారు.


## ముథోల్‌లోని మూడు ఇళ్లల్లో చోరీ..



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ముథోల్ సీఐ, ఎస్సైలు

ముథోల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం కోలీగల్లీలో చాట్లలక్ష్మీకి రెండు రేకుల ఇళ్లు ఉండగా ఒక ఇంటికి తాళం వేసి మరో ఇంట్లో పడుకున్నారు. అయితే దొంగలు తాళం వేసిన ఇంట్లో చొరబడి రూ. 50 వేల నగదు, తులం బంగారు నగలు దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే అదే గల్లీలో రుమ్మల సవిత్ర తన ఇళ్లకు తాళం వేసి వారి బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో దొంగలు తాళం పగులగొట్టి బియ్యం డబ్బాలో ఉన్న రూ. 3 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే మరో గల్లీలో జే. లక్ష్మీ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 4 తులాల వెండి, కొంత బంగారం (నాలుగు మాసాలు) చోరీకి గురయ్యాయి. అలాగే మిగతా రెండు ఇళ్లకు దొంగలు బయట నుండి గొలుసు పెట్టారు. దొంగతనం జరిగిన విషయాన్ని బాధితులు తెలుసుకొని శనివారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ బృందం ఫింగర్ ప్రింట్లు సేకరించారు. దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించమని ఫింగర్ ప్రింట్‌లను తీసుకున్నామని ఎస్సై తెలిపారు. దొంగలను తప్పకుండా పట్టుకుంటామని పేర్కొన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

## విఠలేశ్వర ఆలయంలో చోరీ



పగిలిపోయిన హుండీ

భైంసా రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాగాం గ్రామంలోని శ్రీ విఠలేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగిన ఘటన స్థానికులు తెలిపారు. వివరాల ప్రకారం... ఉదయం దర్శనానికి వెళ్లిన భక్తులు ముఖద్వారం తాళాలు పగిలి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ నైలు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేక రించారు. హుండీలోని రూ. 22,000లు, కానుకలు అపహరణకు గురయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ నైలు తెలిపారు.

## రేపు పీడీఎస్ బియ్యం వేలం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టుబడిన 139.254 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 30వ తేదీన సోమవారం నిర్మల్ తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల లైసెన్స్ కలిగిన వ్యాపారులు ఇట్టి బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసిందిగా కోరారు. వేలం నందు పాల్గొనే వ్యా పారులు వేలం నిర్వహించే ప్రదేశానికి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలన్నారు. రూ. 50 వేలు తహసీల్దార్ నిర్మల్ అర్బన్ పేరున డీడీ తీసుకొని డీడీ ఉదయం 11:30 గంట ల లోపు నిర్మల్ తహసీల్దార్‌కు వేలం ప్రదేశంలో సమర్పించిన వారికి మాత్రమే వేలంలో అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యం ప్రభుత్వ కనిష్ట ధర కిలో రూ.20లుగా నిర్ణయించిందని తెలిపారు.